# రామనామమే మేలు
# రామచింతనే చాలు

**చక్కెరకంటె తీపి దధిసారముకంటెను రుచ్యమౌను పెం**
**పెక్కిన తేనెకన్న అతి రుచ్యము నోటను పల్కపల్కగా**
**మిక్కిలి కమ్మనౌ అమృతమే అనిపించును కాననిత్యమున్**
**చక్కగ దాని మీరు మనసా స్మరియింపుడు రామనామమున్**

*ప్రేమస్వరూపులారా!* కోసలదేశమునకు ముఖ్య పట్టణము అయోధ్య. శత్రువులు ప్రవేశించడానికి వీలుకానటువంటిది కనుకనే, దానికి ఆ పేరు పెట్టడం జరిగింది. అది మనుచక్రవర్తిచే నిర్మింపబడింది. బ్రహ్మదేవుని మానససరోవరమునుండి ఉద్భవించిన సరయూనది అయోధ్యకు సమీపంలో ప్రవహించుచున్నది. అట్టి పవిత్రమైన అయోధ్యను దశరథ మహారాజు పరిపాలించేవాడు. అతనికి సర్వ సౌఖ్యములున్నప్పటికీ పుత్రసంతానం లేనటువంటి విచారము అతనిని చాలా బాధిస్తూవచ్చింది. గుణశీలుడు, పవిత్రహృదయుడైన సుమంత్రుడు ఒకనాడు దశరథునికి ఒక సలహా ఇచ్చాడు. రాజ్యశ్రేయస్సు నిమిత్తం అశ్వమేధయాగమును, సంతాన ప్రాప్తికోసం పుత్రకామేష్టియాగమును ఆచరించవలసిందిగా చెప్పాడు. అందు నిమిత్తం ఋష్యశృంగుణ్ణి రప్పించవలసిందిగా కోరాడు. అంగ రాజ్యాన్ని పరిపాలించే రోమపాదుడు దశరథునియొక్క మిత్రుడు. ఒక పర్యాయం అంగరాజ్యంలో తీవ్ర అనావృష్టి సంభవించగా రోమపాదుడు ఋష్యశృంగుణ్ణి తన రాజ్యానికి రప్పించాడు. ఋష్యశృంగుని రాకతో అంగరాజ్యంలో మళ్ళీ వర్షాలు కురిశాయి.

sri sathyasaivachanamrutam

ఒకనాడు దశరథుడు, రోమపాదుడు, సుమంత్రుడు ముగ్గురూ కలసి ఋష్యశృంగునివద్దకు వెళ్ళారు. దశరథుని కోరికమేరకు ఋష్యశృంగుడు అయోధ్యకు వచ్చి దశరథునిచేత పుత్రకామేష్టి యాగమును ఆచరింప జేశాడు. యాగము జరుగుతూండగా ఆ మంటలమధ్యనుండి మహా తేజోవంతుడైన ఒక పురుషుడు బయటికి వచ్చి వసిష్ఠులవారికి ఒక పాయసపుపాత్రను అందజేశాడు. ఆయన దానిని దశరథునికిచ్చి అతని ముగ్గురు భార్యలకు సమానంగా పంచవలసిందని చెప్పాడు. దీనినిగురించి కంబరామాయణం ఒక రకంగాను, తులసీరామాయణం మరొకరకంగాను, వాల్మీకిరామాయణం వేరొకరకంగాను వర్ణించాయి. దశరథుడు ఆ పాయసాన్ని తన ముగ్గురు భార్యలకొరకు మూడు కప్పులలో సమానంగా పోశాడు. ఆ కాలంలోనైనా, ఈ కాలంలోనైనా ప్రతి వ్యక్తికి సమదృష్టి చాలా ప్రధానమైనది. "మీరు అభ్యంగనస్నానమాచరించి వచ్చి ఋష్యశృంగ మహామునియొక్క ఆశీస్సులనందుకొన్న తరువాత ఈ పాయసమును భుజించాలి", అని వారికి చెప్పాడు.

సుమిత్ర అభ్యంగనస్నానమాచరించి, మేడ పైభాగమునకు వెళ్ళి, కురులను ఆరబెట్టుకుంటూ కూర్చుంది. పాయసం పోసిన కప్పును తన ప్రక్కనే పెట్టుకుంది. కొద్దిసేపటికి పరిచారికలు వచ్చి దశరథ మహారాజు పిలుస్తున్నాడని చెప్పారు. సుమిత్ర కొప్పును కట్టి ఆ కప్పును తీసుకోవడానికి వెళ్ళేలోపల ఎక్కడినుండో ఒక గ్రద్ద వచ్చి ఆ కప్పును తన్నుకొనిపోయింది. సుమిత్ర దిగ్భ్రాంతి చెందింది. "తన భర్తయైన దశరథుడు కోపిస్తాడేమో! వసిష్ఠులవారు ఏమంటారో! ఋష్యశృంగుని శాపానికి గురి కావలసి వస్తుందేమో!" అని ఆమె పరిపరివిధాలుగా చింతించసాగింది. వెంటనే కౌసల్య, కైకేయిలవద్దకు పరుగెత్తుకొని పోయి ఈవిషయాన్ని తెలియజేసింది. ఆనాడు సవతులుకూడా ఒకే తల్లిబిడ్డలవలె చాలా అన్యోన్యంగా ఉండేవారు. కౌసల్య "చెల్లీ! నీవు బాధపడవద్దు" అని చెప్పి లోపలికి వెళ్ళి అలాంటి కప్పునే తీసికొనివచ్చి తన పాయసంలో అర్ధభాగమును అందులో పోసింది. కైకకూడా అదే పని చేసింది. ముగ్గురూ ఆనందంగా పూజా మందిరానికి వెళ్ళి పాయసమును ఆరగించారు. "నా సవతులు నన్ను ఆదరించి, నాకు సహాయం చేశారు. నేనెంత అదృష్టవంతురాలను!" అని సుమిత్ర ఎంతో ఆనందించింది.

sri sathyasai vahini amrutham

తొమ్మిది నెలలు గడిచాయి. ఒక శుభదినమున పంచభూతాలు సమస్థితిలో ఉన్న పవిత్రమైన సమయంలో కౌసల్యకు ఒక కుమారుడు కలిగాడు. అతడే రాముడు. సుమిత్ర ఇరువురు కుమారులను ప్రసవించింది. వారే లక్ష్మణ,శత్రుఘ్నులు. కైకేయికి ఒక కుమారుడు జన్మించాడు. అతడే భరతుడు. జనులను ఆకర్షించేవాడు, ఆనందింప జేసేవాడు కనుకనే, కౌసల్య కుమారునికి రాముడని పేరు పెట్టారు. రమింపజేసేవాడు రాముడు. ఇంతేకాదు. అతడు అద్దమునందు ప్రతిబింబమును చూసినటుల ప్రతి ఒక్కరి హృదయమునందు ఆత్మను దర్శించేవాడు. సర్వులయందు అతనికి చంద్రబింబమును పోలిన ఆత్మతేజస్సు కనిపించేది. అందువల్లనే, అతనికి రామచంద్రుడని పేరు వచ్చింది.

సుమిత్రబిడ్డలు పుట్టినక్షణమునుండి ఏడుస్తూనే ఉన్నారు; పాలు త్రాగరు, నిద్ర పోరు. తన బిడ్డల పరిస్థితి చూసి సుమిత్ర చాలా దుఃఖించింది. ఎవరూ లేని సమయంలో వసిష్ఠులవారి దగ్గరకు వెళ్ళి "స్వామీ! నా బిడ్డలకు శారీరకసంబంధమైన బాధలేమీలేవుకాని, పుట్టిన క్షణమునుండి ఏడుస్తూనే ఉన్నారు. దీనికి కారణమేమిటి?" అని అడిగింది. వసిష్ఠులవారు కన్నులు మూసుకొని ధ్యానమగ్నులై దివ్యదృష్టితో పరికించారు. కొద్దిసేపటికి కన్నులు తెరచి, "అమ్మా సుమిత్రా! నీవు చాలా అదృష్టవంతురాలవు; పేరుకు తగినట్లుగా అందరిపట్ల సమదృష్టితో, మిత్రత్వంతో మెలగేదానవు. నీ కుమారుల పరిస్థితి చూసి నీవు దుఃఖించనవసరం లేదు. నేను చెప్పినట్లు చేయి. కౌసల్య, కైకేయిల వద్దకు వెళ్ళి వారి అనుమతి తీసికొని లక్ష్మణుణ్ణి రాముని ప్రక్కన పరుండబెట్టు; శత్రుఘ్నుణ్ణి భరతుని ప్రక్కన పరుండబెట్టు. అప్పుడు వారు ఏడ్పు మాని పాలు త్రాగుతారు, హాయిగా నిద్రిస్తారు, అన్నివిధాలుగా ఆనందాన్ని అనుభవిస్తారు", అని చెప్పారు. సుమిత్ర కౌసల్య, కైకేయిలవద్దకు వెళ్ళి ఈవిషయాన్ని తెలిపేటప్పటికి వారెంతో ఆనందించి "సుమిత్రా! వారూ మన బిడ్డలే, వీరూ మన బిడ్డలే. అందరూ కలసి మెలసి ఉండడం మనకుకూడా ఆనందమే కదా! కనుక, లక్ష్మణ శత్రుఘ్నులను వెంటనే తీసికొని రా", అన్నారు. సుమిత్ర లక్ష్మణుణ్ణి తీసికొనివచ్చి రాముని ప్రక్కన పరుండబెట్టింది. భరతుడు పడుకున్న ఊయలలో శత్రుఘ్నుణ్ణి పరుండబెట్టింది. ఆ క్షణమునుండి ఇరువురూ ఏడ్పు మానేసి ఉల్లాసంగా కాళ్ళు, చేతులు ఊపుతూ ఆనందంతో కేరింతలు కొట్టసాగారు.

sri sathyasai vahini amrutam

లక్ష్మణ శత్రుఘ్నులు ఏడ్పు మాని ఆనందంగా ఆడుకోవడం చూసిన తరువాత సుమిత్రకు మనశ్శాంతి కల్గింది. వసిష్ఠులవారు ఏకాంతంగా కనిపించినప్పుడు మళ్ళీ ఆయనవద్దకు వెళ్ళి తన పిల్లల వింతప్రవర్తనకుగల కారణమేమిటో తెలియజేయవలసిందిగా కోరింది. అప్పుడు వసిష్ఠులవారు, "సుమిత్రా! నీవు సద్గుణవంతురాలవు, సదాచారసంపన్నురాలవు. నీ మనస్సు నిర్మలమైనది, నిశ్చలమైనది, నిస్వార్థమైనది. కాబట్టి, ఈవిషయాన్ని నీవు సులభంగా గ్రహించగలవు. ఆనాడొక గ్రద్ద నీ పాయసపుగిన్నెను తన్నుకొనిపోయినప్పుడు కౌసల్య, కైకేయిలు తమ పాయసంలో చెరిసగం నీకిచ్చారు కదా! కౌసల్య ఇచ్చిన పాయసమునుండి పుట్టినవాడే లక్ష్మణుడు. కైకేయి ఇచ్చిన పాయసమునుండి పుట్టినవాడే శత్రుఘ్నుడు. కనుక, లక్ష్మణుడు రాముని అంశమందలివాడు, శత్రుఘ్నుడు భరతుని అంశమందలివాడు. ఎవరి అంశము వారితో చేరిపోవడంచేత ఆనందము ననుభవిస్తున్నారు," అని వివరించారు. దీనినే భగవద్గీతలో కృష్ణుడుకూడా చెప్పాడు: "మమైవాంశో జీవలోకే జీవభూత స్సనాతనః". "అందరూ నా అంశములే", అన్నాడు.

రామ, లక్ష్మణ, భరత, శత్రుఘ్నులకు యుక్తవయస్సు వచ్చింది. దశరథుడు వారికి వివాహం చేయాలని సంకల్పించుకున్నాడు. అదే సమయానికి ఒక దూత లోపలికి వచ్చి "మహారాజా! విశ్వామిత్రుల వారు ఏతెంచినారు", అని తెలియజేశాడు. భగవత్సంకల్పానుసారం ఏ సమయానికి ఏది జరగాలో అది జరుగుతుంది. దశరథుడు తానే స్వయంగా ద్వారంవద్దకు వెళ్ళి విశ్వామిత్రునికి స్వాగతం పలికాడు. "స్వామీ! నా అదృష్టం పండింది. నా కుమారులకు వివాహం చేయాలని ఈనాడే సంకల్పించుకున్నాను. ఇప్పుడు మీ ఆశీర్వాదం కూడా లభించింది. మీరాక నాకెంతో ఆనందాన్ని కల్గిస్తోంది. మీరు వచ్చిన పని ఏమిటో తెలుప వలసిందిగా కోరుతున్నాను. మీకు ఏ సహాయం కావలసినా చేయడానికి నేను సిద్ధంగా ఉన్నాను", అన్నాడు. అప్పుడు విశ్వామిత్రుడు తానొక యజ్ఞమును తలపెట్టానని, ఆ యజ్ఞమునకు రాక్షసులనుండి అంతరాయం కలుగకుండా కాపాడటానికి రాముణ్ణి తనవెంట తీసికొని వెళ్ళడానికి వచ్చానని అన్నాడు. దశరథుని హృదయంలో ఒక పెద్ద ఆటమ్‌బాంబు పడినట్లైంది. "నేను ఎంతోకాలం



srisathyasaivachanamrutam

యజ్ఞయాగాదులను ఆచరించిన తరువాత నాకీ పిల్లలు కలిగారు. ఈయన రాముణ్ణి యజ్ఞసంరక్షణార్థం అరణ్యానికి తీసుకువెళతానంటున్నాడే! రాముడు ఏనాడూ అరణ్యానికి వెళ్ళలేదు, రాక్షసులను చూడలేదు, ఎవరితోనూ పోరాడలేదు. ఎవరిపట్లనూ అతనికి ద్వేషం లేదు. అలాంటివానిని నేను అరణ్యానికి ఎలా పంపగలను?" అని తనలో తాను చింతించి, "ఋషివర్యా! చిన్నపిల్లవాడైన రాముణ్ణి రాక్షసులతో పోరాటానికి ఏవిధంగా పంప గలను?" అన్నాడు. వెంటనే విశ్వామిత్రుడు "దశరథా! మీ ఇక్ష్వాకు వంశంలో ఇంతవరకు ఆడినమాట తప్పినవారు లేరు. ఇప్పుడు నీవు ఆడినమాట తప్పితే ఇక్ష్వాకు వంశానికే అపకీర్తి తెచ్చినవాడవౌతావు. కాబట్టి, రాముణ్ణి నావెంట పంపుతావా? లేక, ఆడిన మాట తప్పుతావా? యోచించుకో" అన్నాడు. దశరథుడు ఏదీ నిర్ణయించుకోలేక వసిష్ఠులవారిని పిలిపించాడు. ఆయన "దశరథా! నీ పుత్రులు సామాన్యులు కారు; దైవసంకల్పానుసారం నీకు లభించిన వరప్రసాదాలు; అగ్నినుండి ఆవిర్భవించిన జ్ఞానభాస్కరులు. వారికి ఎటువంటి ఆపదలూ సంభవించవు. కనుక, నీవిచ్చిన మాటప్రకారం రాముణ్ణి విశ్వామిత్రునివెంట పంపించు", అని నచ్చజెప్పారు.

ఇక్కడ మీరొక ముఖ్య విషయాన్ని గుర్తించాలి. విశ్వామిత్రుడు రాముడొక్కడినే కోరుకున్నాడు. రాముడు ఆయనవెంట బయలు దేరాడు. తాను వెళ్ళే సమయంలో లక్ష్మణుణ్ణి తనవెంట రమ్మని రాముడు పిలువలేదు; వెళ్ళవలసిందిగా తండ్రి ఆజ్ఞాపించలేదు, రమ్మని విశ్వామిత్రుడూ కోరలేదు. కాని, బింబము వెంట ప్రతిబింబము వెళ్ళినట్లుగా రామునివెంట లక్ష్మణుడుకూడా బయలుదేరాడు. ఎందుకంటే, అతడు రాముని అంశమందలివాడు. విశ్వామిత్రుడు అది దైవసంకల్పమని భావించాడు. తాను వెళ్ళే ముందుగా దశరథునితో "దశరథా! నాలో లేని శక్తులు లేవు. కాని, నేను యజ్ఞదీక్షలో కూర్చున్నప్పుడు హింసకు పూనుకోకూడదు; రాక్షసులనైనా చంపకూడదు. అది యజ్ఞదీక్షకు సంబంధించిన నియమం. అందుచేతనే, రాముణ్ణి నావెంట పంపవలసిందిగా నిన్ను కోరాను", అన్నాడు.

ముగ్గురూ సరయూతీరానికి చేరుకున్నారు. విశ్వామిత్రుడు 'రామా, ఇటురా' అని

sri sathyasai vacharamrutam

పిలిచాడు. రామునితోపాటు లక్ష్మణుడుకూడా వెళ్ళి విశ్వామిత్రుని దగ్గర కూర్చున్నాడు. అప్పుడు విశ్వామిత్రుడు "రామ లక్ష్మణులారా! ఇది అరణ్యంలో జరిగే యజ్ఞము. నేనుండేది సిద్ధాశ్రమము. అక్కడ వంటా వార్పూ చేయడానికి వీలుకాదు. మీరు రాజపుత్రులు; రుచికరమైన భోజనమునకు, సౌఖ్యవంతమైన జీవితమునకు అలవాటు పడినవారు; ఇప్పుడు నా వెంట యజ్ఞ సంరక్షణకై వస్తున్నారు. అక్కడ మీరెన్ని దినములు ఉండవలసి వస్తుందో! మీకు నిద్ర రాకూడదు. ఆహారమునకై మీరు పరితపించ కూడదు. కనుక, నేను మీకు 'బల', 'అతిబల' అనే మంత్రముల నుపదేశిస్తాను. వాటిప్రభావంచేత మీకు నిద్ర రాదు, ఆకలి దప్పులుండవు," అని పలికాడు. రామలక్ష్మణులకు ఆ మంత్రముల నుపదేశించాడు. "రాముడు సామాన్యుడు కాడు, లోక రక్షకుడు" అని దశరథుని ఎదుట వర్ణించిన విశ్వామిత్రుడు ఇక్కడ రామునికి మంత్రోపదేశం చేయడమెందుకు? ఇదే మాయయొక్క ప్రభావం.

యజ్ఞము ప్రారంభమైంది. మారీచుడు వచ్చి ఆటంకం కల్గించ డానికి ప్రయత్నించాడు. రాముడు ఒకే ఒక బాణంతో ఆ రాక్షసుణ్ణి ఎక్కడో దూరంగా పడేటట్లు చేశాడు. తరువాత చెవులు చిల్లులు పడేటంతటి పెద్ద శబ్దం వినిపించింది. రాముడు విశ్వామిత్రునితో "స్వామీ! ఏమిటీ శబ్దం? పర్వతాలు కూలిపోతున్నట్లుగా ఉన్నదే!" అన్నాడు. అందుకు విశ్వామిత్రుడు "పర్వతాలు కూలిపోవడం కాదు నాయనా! అది తాటకియొక్క కంఠధ్వని. ఆమె వస్తోంది, సిద్ధంగా ఉండు", అని హెచ్చరించాడు. రామునికొక సందేహం వచ్చింది. "స్వామీ! స్త్రీని సంహరించడం క్షత్రియధర్మం కాదు కదా!" అన్నాడు. అందుకు విశ్వామిత్రుడు "రామా! యజ్ఞసంరక్షణ విషయంలో నీవు స్త్రీ, పురుష భేదమును పాటించనక్కర్లేదు", అన్నాడు. గురువాజ్ఞను మీరడానికి ఇష్టం లేక రాముడు తాటకిని సంహరించాడు. అయితే, తాటకి అంత సులభంగా చావలేదు. ఎంతో యుద్ధం జరిగింది. ఇప్పుడా వివరాలు మనకక్కర్లేదు. తాటకి మరణంతో సిద్ధాశ్రమంలో ప్రశాంతవాతావరణం నెలకొంది. దేవతలు పుష్పవర్షం కురిపించారు. యజ్ఞం నిర్విఘ్నంగా జరిగింది.

ఇదిట్లుండగా, మిథిలాపురినుండి ఒక దూత వచ్చి విశ్వామిత్రునికి ఒక లేఖ



srisathyasaivacharamrutam

నందించాడు. జనకమహారాజు తాను తలపెట్టిన యజ్ఞంలో పాల్గొనడానికి విచ్చేయవలసిందిగా విశ్వామిత్రుణ్ణి ఆహ్వానిస్తూ వ్రాసిన లేఖ అది. వెంటనే విశ్వామిత్రుడు మిథిలకు బయలుదేరాడు. సన్యాసులకు సర్దుకోవడానికి లగేజి అంటూ ఏమీ ఉండదు కదా! ఒక గుడ్డను మీద వేసుకొని, "రామలక్ష్మణులారా! మీరుకూడా వస్తున్నారా?" అని అడిగాడు. అందుకు రాముడు "స్వామీ! మా తండ్రి మమ్మల్ని పంపినది మీ యజ్ఞసంరక్షణార్థమేగాని, జనక మహారాజు చేసే యజ్ఞమును చూడటానికి కాదు కదా!" అన్నాడు. అప్పుడు విశ్వామిత్రుడు రామలక్ష్మణులకు ఉత్సాహం కల్గించే మాటలు మాట్లాడాడు. "నాయనా! అది చాలా గొప్ప యజ్ఞము. జనకుని వద్ద శివధనుస్సు ఉన్నది. దానిని కదిలించడానికికూడా ఎవ్వరికీ చేతకాదు. అలాంటి శివధనుస్సును అతని కుమార్తెయైన సీత ఒకపర్యాయం అవలీలగా ఎత్తిందట. అందుచేత శివధనుస్సును ఎక్కుపెట్ట గల్గినవానికే తన బిడ్డనిచ్చి వివాహం చేయాలని జనకుడు సంకల్పించు కున్నాడు. దానికి సంబంధించి ఒక యజ్ఞమును ప్రారంభిస్తున్నాడు", అని చెప్పాడు. చివరికి వారిని ఒప్పించి తన వెంట మిథిలానగరానికి తీసుకు వెళ్ళాడు.

మిథిలాపురజనులతో సభాప్రాంగణం క్రిక్కిరిసిపోయింది. దేశ దేశాలకు చెందిన రాజులు వచ్చారు. అందులో రావణుడుకూడా ఉన్నాడు. అతడు భారీకాయుడు, మహాబలవంతుడు. మొట్టమొదట శివధనుస్సును ఎత్తడానికి తానే ముందుకు వచ్చాడు. అతను దర్పంగా చేతులు కదిలిస్తూ ధనుస్సును ఎత్తడానికి వెళుతుంటే రాజులందరూ ఆశ్చర్యపడ్డారు. "ఒకవేళ ఇతను శివధనుస్సును ఎక్కుపెట్టగల్గితే జనకుడు సీతను ఇతనికిచ్చి వివాహం చేయవలసి వస్తుంది కదా! ఇతని ఆకారమే ఇంత భీకరంగా ఉన్నది. ఇలాంటివానికి జనకుడు సుకుమారియైన సీతను ఎలా ఇవ్వగలడు? సరే, ఏమౌతుందో చూద్దాం", అని ప్రజలు తామలో తాము అనుకుంటున్నారు. రావణుడు మొదట ఎడమ చేత్తో ఆ ధనుస్సును ఎత్తడానికి ప్రయత్నించాడు. అది కదల్లేదు. తన బలమునంతా ఉపయోగించి రెండు చేతులతో ప్రయత్నించాడు. కాని, చేతగాక క్రిందపడిపోయాడు. అహంకారం అధః పతనానికి దారితీస్తుంది. అవమానమే అహంకారానికి లభించే ఫలితం. అహంకారం గలవానికి గౌరవమర్యాదలు చిక్కవు, దక్కవు.

sri sathyasai vachanamrutam

రావణుడు క్రిందపడిపోవడం చూసి అందరూ ఆశ్చర్యపడ్డారు. "ఇంతటి మహాబలవంతుడే ఆ ధనుస్సును ఎత్తలేకపోతే ఇంక దానిని ఎత్తడం ఎవ్వరికీ సాధ్యంకాదు" అని భావించి, ముందుకు రావడానికి కూడా భయపడ్డారు. పరిస్థితిని అర్థం చేసుకొని విశ్వామిత్రుడు రామునికి కనుసైగ చేశాడు. రాముడు లేచాడు. అప్పటికి అతడు పదహైదు సంవత్సరాల పిల్లవాడు. రాముడు నడుచుకుంటూ వస్తుంటే ఆ నడకకూడా అందరినీ ఆకర్షించింది. ఆ దివ్యతేజస్సు అందరికీ ఆశ్చర్యం కల్గించింది. సర్వశక్తులూ నీడవలె అతనిని వెన్నంటి వస్తున్నట్లు అనిపించింది. రాముడు ప్రశాంతంగా నడుచుకుంటూ వచ్చి, చిరునవ్వుతో అంగవస్త్రం సర్దుకొని ఎడమచేతితో ఆ ధనుస్సును పట్టుకున్నాడు. పట్టిన తక్షణమే అది లేచింది. అల్లెత్రాటిని బిగించడానికి దానిని వంచాడు. తక్షణమే అది బ్రహ్మాండమైన శబ్దం చేస్తూ విరిగిపోయింది. అందరూ ఉలిక్కిపడ్డారు. "ఏమిటీ రాముని శక్తి! ఏమిటీ విచిత్రం!" అని సంభ్రమాశ్చర్యాలకు గురి అయ్యారు.

తక్షణమే చెలికత్తెలు సీతను తీసుకువచ్చారు. చేతిలో పూలమాల పట్టుకొని సీత నిలబడింది. విశ్వామిత్రుడు "రామా! నీవు సిద్ధమేనా?" అని అడిగాడు. రాముడు "స్వామీ! నన్ను నా తండ్రి మీ యజ్ఞసంరక్షణార్థం పంపించాడు. ఆ పని పూర్తి చేశాను. నా తండ్రి ఆజ్ఞ లేకుండా ఈ వివాహానికి నేను అంగీకరించను", అన్నాడు. విశ్వామిత్రుడు ఈవిషయాన్ని జనకుని చెవిలో చెప్పాడు. జనకుడు రాజనీతిజ్ఞుడు కాబట్టి, ఆయనకూడా దీనికి అంగీకరించి వెంటనే అయోధ్యకు వర్తమానం పంపించాడు. దశరథమహారాజును, ఆయన కుటుంబసభ్యులను, ఇతర పరివారాన్ని సకల రాజ లాంఛనాలతో తీసికొని రావడానికి తన సైన్యాన్ని పంపించాడు. వారు అక్కడినుండి రావడానికి మూడు దినములు పట్టింది. ఆ మూడు రోజులూ రామలక్ష్మణులు బయటికి వెళ్ళలేదు.

ఇక్కడొక చిన్న తమాషా జరిగింది. ఒకరోజు రాముడు తన గదిలో కాలుపైన కాలు వేసుకొని కూర్చొని, తన పాదాలను తానే నెమ్మదిగా ఒత్తుకుంటున్నాడు. ఆ సమయంలో అక్కడికి వచ్చిన నారదుడు బయటి నుండి ఆ దృశ్యాన్ని చూసి "పాపం, ఇంతదూరం నడుచుకుంటూ రావడం చేత పాదాలు నొప్పిగా ఉన్నాయేమో!" అనుకొని లక్ష్మణుణ్ణి పిలిచాడు. లక్ష్మణుడు తలుపు తెరుచుకొని లోపలికి వెళ్ళి రాముని పాదాలను ఒత్తడం



srisathyasaivachanamrutam

ప్రారంభించాడు. అప్పుడు రాముడు "లక్ష్మణా! నాకు నొప్పి లేదు. ప్రపంచం కోసం ఈరీతిగా నటిస్తున్నాను", అన్నాడు. లక్ష్మణునికికూడా తెలుసు – రామునికి ఎట్టి బాధలూ లేవని, ఎట్టి బాధలూ రావని.

మూడురోజుల తరువాత దశరథమహారాజు తన కుటుంబ సభ్యులతో, బంధుమిత్రులతో, వేలాది ప్రజలతో, సైన్యంతో మిథిలానగరానికి చేరుకున్నాడు. సీత జనకునికి భూమిని దున్నేటప్పుడు చిక్కినటువంటిది. ఆయనకు ఊర్మిళ అనే కుమార్తెకూడా ఉన్నది. ఆమెను లక్ష్మణునికిచ్చి వివాహం చేయాలని నిశ్చయించారు. జనకుని తమ్ముడైన కుశధ్వజునికి మాండవి, శ్రుతకీర్తి అని ఇరువురు కుమార్తెలు. మాండవిని భరతునికి, శ్రుతకీర్తిని శత్రుఘ్నునికి ఇచ్చి వివాహం చేయాలని నిర్ణయించారు.

నల్గురు అన్నదమ్ముల వివాహాలు ఒకేరోజున జరిగాయి. వివాహ మహోత్సవం ప్రారంభమైంది. సీత రాముని మెడలో మాల వేయాలి. ఆజానుబాహుడైన రాముని మెడలో మాల వేయడానికి ఆమెకు వీలుకావడం లేదు. అంతమంది ప్రజల సమక్షంలో ఒక స్త్రీ ఎదుట శిరస్సు వంచడం అవమానంగా భావించి రాముడు తలవంచకుండా నిలబడ్డాడు. ఆ కాలంలో స్త్రీలు పురుషుల ముఖం చూసేవారు కారు. కనుక, సీత తలవంచుకొని రాముని మెడలో మాల వేయడానికి చాలా ప్రయత్నిస్తోంది. కాని, రాముని శిరస్సు ఆమెకు అందడం లేదు. అప్పుడు రాముడు లక్ష్మణునివైపు చూసి "నీవు భూమిని మోసే ఆదిశేషుడవు కదా! సీత నిలబడినచోట భూమిని కాస్త పైకి ఎత్తు," అన్నట్లుగా సైగ చేశాడు. లక్ష్మణుడు "అన్నా! సీతమ్మ ఉన్నచోటును మాత్రమే ఎత్తడానికి వీలుకాదు. ఎత్తితే మొత్తం భూమినే ఎత్తాలి", అని తెలిపాడు.

ప్రజలంతా సీతారామకల్యాణాన్ని చూడాలని ఎంతో ఆత్రుతతో ఎదురుచూస్తున్నారు. "ఎందుకు రాముడు తలవంచడంలేదు? ఎందుకు సీత రాముని మెడలో మాల వేయడంలేదు?" అని తమలో తాము గుసగుసలాడుకుంటున్నారు. ఈ పరిస్థితిని గమనించి లక్ష్మణుడు పరుగెత్తుకొనివచ్చి రాముని పాదాలపై పడ్డాడు. పడినవాడు ఎంతసేపైనా లేవలేదు. అప్పుడు రాముడు "లక్ష్మణా! లెమ్ము" అని అతనిని లేవనెత్తడానికి ముందుకు

sri sathyasai vahini amrutam

వంగాడు. ఇదే తగిన సమయమని గుర్తించి సీత తక్షణమే రాముని మెడలో మాల వేసింది. వివాహం వైభవోపేతంగా జరిగింది. అందరూ అయోధ్యకు బయలుదేరారు. మార్గమధ్యంలో పరశురామునితో కలహం సంభవించింది. రెండు సుఖముల మధ్య ఒక కష్టంకూడా ఉంటుంది కదా! అయితే, రాముడు పరశురాముణ్ణి జయించాడు. అందరూ అయోధ్యకు చేరుకున్నారు. కొంతకాలం ఆనందంగా గడిచింది.

ఒకనాడు తెల్లవారుఝామున మూడు గంటలకు దశరథునికి ఒక పీడకల వచ్చింది. ఆ సమయంలో వచ్చిన స్వప్నం నిజమౌతుందని దశరథుని విశ్వాసం. తాను వృద్ధుడైపోయినట్లు, తన చేతులు, కాళ్ళు వణుకుతున్నట్లు అనేక అపశకునాలు కనిపించాయి. చాలా బాధ పడుతూ లేచాడు. "ఇంక నేనెంతో కాలం ఉండను. కనుక, రామునికి వెంటనే పట్టాభిషేకం చేయాలి. దీనికి ఏర్పాట్లేమీ అవసరం లేదు" అని అప్పటికప్పుడు సంకల్పించుకున్నాడు. వసిష్ఠులవారిని సంప్రదించి ఆయన అనుమతి పొందాడు. రాముణ్ణి పిలిపించి "రామా! రేపటిదినం నీకు పట్టాభిషేకం చేయాలని సంకల్పించు కున్నాను. సిద్ధంగా ఉండు," అన్నాడు. రాముడు సర్వజ్ఞుడు, సర్వశక్తిమయుడు, సర్వవ్యాపకుడు. అయినప్పటికీ తండ్రిమాటకు ఎదురు చెప్పడం మంచిదికాదని కొద్దిసేపు యోచించి, "నాన్నా! భరత శత్రుఘ్నులు ఇక్కడ లేరు కదా! వాళ్ళుకూడా రావాలి కదా!" అన్నాడు. "అది నీకనవసరం. నాఆజ్ఞను నీవు శిరసావహించు," అన్నాడు దశరథుడు. అప్పుడు రాముడు "మేము నల్గురమూ యజ్ఞపాయసమునుండి పుట్టాము, మా నల్గురికీ నామకరణం, అక్షరాభ్యాసం, ఉపనయనం, వివాహాలు సమానంగా ఒకేరోజున చేశారు. మరి ఇప్పుడు నాకొక్కనికే పట్టాభిషేకం ఎందుకు చేయాలి? ఒకేపర్యాయం మా నల్గురికీ పట్టాభిషేకం చేయండి", అని పలుకగా దశరథుడు "నాయనా! రాజ్యం ఒక్కటే. కనుక, రాజుకూడా ఒక్కడే ఉండాలి. నలుగురికీ పట్టం కట్టడానికి వీలుకాదు", అన్నాడు. "రాజ్యాన్ని నాల్గుభాగాలుగా విభజించి, మా నల్గురికీ ఒకే పర్యాయం పట్టాభిషేకం చేయవచ్చు", అన్నాడు రాముడు. దశరథునికి తల తిరిగింది. "రామా! నీవు కొద్దిసేపు బయటికి వెళ్ళు", అన్నాడు. వసిష్ఠులవారిని పిలిపించి ఆయనతో ఈవిషయాన్ని

sri sathyasai vachanamrutam

చర్చించాడు. వసిష్ఠులవారు రామునికి నచ్చజెప్పడానికి ప్రయత్నించారు. "రామా! తరతరములనుండి మన రాజ్యం విభజనకు గురికాకుండా ఒక్కరి ఆధిపత్యంలోనే ఉంటూవచ్చింది. ఇప్పుడు నీవు రాజ్యాన్ని విభజించా లంటున్నావు. అది శ్రేయస్కరం కాదు", అన్నాడు. "విభజించనక్కర్లేదు. ఒక్కొక్క ప్రాంతాన్ని ఒక్కొక్కరు పరిపాలించవచ్చు", అన్నాడు రాముడు. కాని, దశరథుడు అంగీకరించలేదు.

రాముడు సమత్వమునకు, సాంఘికన్యాయానికి అత్యంత ప్రాధాన్యత నిచ్చాడు. అందరూ సమత్వంగా జీవించాలి, హెచ్చు తగ్గులు ఏమాత్రం ఉండకూడదు, భేదములకు అవకాశం అందించ కూడదు. ఇదీ రాముని ఆశయం. కాని, దశరథుడు వృద్ధాప్యంవలన రాముడు చెప్పే మాటలను అర్థం చేసుకునే స్థితిలో లేడు. అందుచేత, రాముడు "భరత శత్రుఘ్నులు కూడా రావాలి" అన్నాడు. వాళ్ళు రావడానికి కనీసం పదహైదు రోజులు పడుతుంది. కాబట్టి, ఈలోపల తగినరీతిగా యోచన చేసుకోవచ్చని భావించాడు. అప్పటికి పట్టాభిషేకం నిలిచిపోయింది. రాముని శక్తి సామర్థ్యములు, యుక్తి ప్రయుక్తులు చాలా చిత్రమైనవి, విచిత్రమైనవి. అందరూ సమత్వంగా ఉండాలన్నదే భారతీయసంస్కృతియొక్క ప్రధాన సందేశం. "సర్వే జనాః సుఖినో భవంతు", "లోకాస్సమస్తాః సుఖినో భవంతు." అందరూ సుఖంగా ఉండాలి. ఇలాంటి ప్రాచీన సంస్కృతిని రాముడు పాటిస్తూ వచ్చాడు. ఈనాడు అనేకమంది రామాయణం చదువుతున్నారు; పెద్దపెద్ద తలదిండ్లమాదిరి ఉండే పుస్తకాలను తెచ్చి పెట్టుకుంటున్నారు; శ్లోకాలను కంఠస్థం చేస్తున్నారు. కాని, వాటి సారాన్ని కించిత్తైనా గ్రహించడం లేదు.

కౌసల్య చాలా గుణవంతురాలు. ఆమె పట్టపురాణి కాబట్టి, అందరూ ఆమె ఆజ్ఞను శిరసావహించేవారు. ఇంక, దశరథుని మూడవ భార్యయైన కైకేయి ఆజ్ఞకుకూడా ఏమాత్రం అడ్డు లేదు. దశరథుడైనా సరే, కూర్చో అంటే కూర్చోవాలి, లెమ్మంటే లేవాలి. ఈవిధంగా, ఆమె దశరథుణ్ణి తన చేతిలో పెట్టుకొని నాటకమాడుతూ వచ్చింది. కాని, సుమిత్రను పట్టించుకునేవారు ఎవ్వరూ లేరు. రాముడు పధ్నాల్గు సంవత్సరాలు అరణ్యవాసం చేయాలని కైకేయి కోరడంతో పట్టాభిషేకం జరగలేదు. రాముడు అరణ్యానికి బయలుదేరే

srisathyasaivachanamrutam

ముందు తల్లియైన కౌసల్యకు నమస్కారం చేయడానికి వెళ్ళాడు. ఆమె ఘొల్లున ఏడుస్తున్నది. అంతఃపురమంతా ఏడ్పులే! ఇంక, లక్ష్మణుడు సుమిత్రకు నమస్కారం చేయడానికి వెళ్ళాడు. అప్పుడామె, "నాయనా లక్ష్మణా! నీవు అరణ్యానికి వెళుతున్నానని భావించ వద్దు. అది అరణ్యం కాదు. సీతారాములు లేనటువంటి అయోధ్యయే అరణ్యం. సీతారాములు నివసించే అరణ్యమే అయోధ్య. కాబట్టి, నీవు అరణ్యంలో ఉన్నప్పటికీ అయోధ్యలోనే ఉన్నట్లుగా భావించు. రాముడే నీ తండ్రి. సీతయే నీ తల్లి. వారి సేవలకు ఎట్టి ఆటంకమూ కలుగకుండా చూసుకో", అని హితబోధ చేసింది. ఏ తల్లియైనా ఈరీతిగా చెప్తుందా? "దశరథుడు కైకేయికిచ్చిన వరము ననుసరించి రాముడు మాత్రమే అరణ్యానికి వెళ్ళాలి. నీవు వెళ్ళనక్కర్లేదు", అని తాను లక్ష్మణుణ్ణి అడ్డుకో వచ్చును. కాని, సుమిత్ర ఆవిధంగా చేయలేదు. మాతృమూర్తియందు ఉండవలసిన సుగుణములన్నీ ఆమెయందు గోచరించాయి.

లక్ష్మణుని భార్య ఊర్మిళ. సుమిత్రవలె ఆమెకూడా గొప్ప గుణవంతురాలు. ఆమెకున్న త్యాగము, ఔదార్యము ఎవ్వరికీ లేవు. అరణ్యానికి వెళ్ళిన తరువాత పధ్నాల్గు సంవత్సరాలపాటు తిరిగి రావడానికి వీలుండదు కదా! కనుక, ఆమెకు ఒకతూరి చెప్పిపోదామని లక్ష్మణుడు వెళ్ళాడు. ఆ సమయంలో ఆమె తన గదిలో కూర్చుని సీతారామపట్టాభిషేక ఘట్టమును రంగులతో చిత్రిస్తున్నది. ఆ చిత్రమును తన తండ్రియైన జనకునికి పంపాలని ఆమె ఉద్దేశ్యం. ఇంతలో లక్ష్మణుడు వెళ్ళి "ఊర్మిళా!" అని కాస్త గట్టిగా పిలిచాడు. ఆమె ఉలిక్కిపడి లేచింది. లేచేటప్పటికి ఆమె ప్రక్కనున్న రంగంతా తాను గీసిన చిత్రముపై ఒలికిపోయింది. "అయ్యో, దీనిని చెడగొట్టుకున్నానే" అని బాధపడింది. అప్పుడు లక్ష్మణుడు "ఊర్మిళా! విచారించకు. రామునియొక్క పట్టాభిషేకమును కైకేయి చెడగొట్టింది. నీవు గీసిన పట్టాభిషేక చిత్రమును నీ భర్తయైన లక్ష్మణుడు చెడగొట్టాడు. కాబట్టి, నీవు బాధపడనక్కర్లేదు" అన్నాడు. జరిగిన సంగతి ఆమెకు వివరించి, తాను రామసేవ నిమిత్తం అరణ్యానికి వెళుతున్నట్లు చెప్పాడు. ఆమె ఆనందంగా అంగీక రించింది. తన భర్త తనను వదలిపెట్టి వెళుతున్నాడని బాధపడలేదు. తననుకూడా వెంట తీసుకువెళ్ళమని ఏమాత్రం ఒత్తిడి చేయలేదు.

srisathyasai vahini / vacharamrutam

"నాథా! నిన్ను, నీ సోదరుడైన శత్రుఘ్నుణ్ణి నా అత్తగారు సేవ కోసమే కన్నారు. నీవు రామసేవ చేయడానికే జన్మించావు. శత్రుఘ్నుడు భరతునికి సేవ చేయడానికే జన్మించాడు. కాబట్టి, నీ కర్తవ్యాన్ని నీవు నిర్వర్తించు. అయితే, నాకొక మాట ఇవ్వాలి. నీవు అరణ్యంలో ఉండే పద్నాల్గు సంవత్సరాలలో ఒక్క క్షణంకూడా నన్ను తలంచకూడదు. నన్ను తలుచుకుంటే సీతారాముల సేవకు అభ్యంతరం కల్గుతుంది. కనుక, నీవు నిరంతరం వారినే స్మరిస్తూ వారికి ఎలాంటి ఇబ్బందీ కలుగకుండా చూసుకో. ఈ పద్నాల్గు సంవత్సరాలపాటు నన్ను పూర్తిగా మరచిపో", అని చెప్పింది. ఏ భార్యయైనా ఈరీతిగా చెబుతుందా? ఎవ్వరూ చెప్పరు. ఆమెయొక్క విశాలమైన భావములకు లక్ష్మణుడే కరిగిపోయి కన్నీరు కార్చాడు. "ఊర్మిళా! నీకింతటి విశాలమైన భావాలున్నాయని నేననుకో లేదు. నీ విశాలమైన భావాలను నా హృదయంలో నిల్పుకుంటాను", అన్నాడు. అప్పుడు ఊర్మిళ "నా భావాలనుకూడా నీవు తలంచవద్దు. సీతా రాములయొక్క విశాలమైన భావాలను నీ హృదయంలో నిల్పుకో. వారి ఆజ్ఞను శిరసావహించు. వారికెలాంటి కష్టమూ కలుగకుండా చూసుకో", అని కోరింది. సుమిత్ర, ఊర్మిళలయొక్క గుణసంపత్తిని ఎవ్వరూ వర్ణించలేరు. ఊర్మిళవంటి గుణవంతురాలైన భార్య, సుమిత్రవంటి ఆదర్శవంతురాలైన మాతృమూర్తి ఈనాడు ఎక్కడా కనిపించడం లేదు.

యుద్ధంలో లక్ష్మణుడు మూర్ఛిల్లినప్పుడు రాముడు "లక్ష్మణా! ఈ ప్రపంచంలో వెతికితే సీతవంటి భార్యయైనా నాకు లభించవచ్చు. కాని, నీవంటి సోదరుడు లభించడు. నిన్ను కోల్పోయిన తరువాత ఇంక నేనెందుకు బ్రతికియుండాలి?" అని పరితపించాడు. అక్కడున్న వైద్యులు సంజీవని మూలికద్వారా లక్ష్మణుణ్ణి బ్రతికించడానికి వీలౌతుందని చెప్పారు. వెంటనే హనుమంతుడు ఆకాశమార్గాన సంజీవనిమూలిక లభించే పర్వతంవద్దకు వెళ్ళాడు. కాని, ఆ మూలిక ఎలా ఉంటుందో అతనికి తెలియకపోవడంచేత ఆ పర్వతాన్నంతటినీ పెకలించుకొని బయలుదేరాడు. నందిగ్రామంమీదుగా వెళుతూంటే భరతుడు అతనిని చూసి ఎవరో రాక్షసుడని భావించి అంబులు వదిలాడు. వెంటనే హనుమంతుడు పర్వతంతోపాటు క్రిందపడ్డాడు. నందిగ్రామ ప్రజలు, అయోధ్యావాసులు పరుగెత్తుకొని వచ్చి హనుమంతుని చుట్టూ గుమికూడారు. హనుమంతుడు అందరికీ నమస్కరించి,

sri sathyasai vahini

భరతునివైపు చూసి, "భరతా! నీ సోదరుడైన లక్ష్మణుడు యుద్ధంలో మూర్ఛిల్లినాడు. అతనిని బ్రతికించే నిమిత్తం వైద్యులు సంజీవని మూలికను తీసికొనిరమ్మన్నారు. సంజీవని ఎలా ఉంటుందో నాకు తెలియదు. అందుచేత, ఆ మూలిక వున్న పర్వతాన్నంతటినీ పెకలించుకొని తీసుకువెళుతున్నాను", అన్నాడు. లక్ష్మణుడు మూర్ఛిల్లిన వార్త వినగానే అందరూ "అయ్యో, లక్ష్మణుడు మూర్ఛిల్లినాడా? రాముడు బాధ పడుతున్నాడా? ఎందుకు వీరికిన్ని కష్టాలు?" అని కన్నీరు కార్చారు; ఇంక ఆడవారైతే చెప్పనక్కర్లేదు. కాని, ఒక్క స్త్రీ మాత్రం కన్నీరు కార్చలేదు. ఆమెయే సుమిత్ర. "రామునికి ఎట్టి బాధలూ కల్గవు. నిరంతరం రామనామాన్ని స్మరించే లక్ష్మణునికికూడా ఎట్టి ఆపదా సంభవించదు", అనే దృఢ విశ్వాసంతో ఆమె ధైర్యంగా ఉన్నది.

భరతుడు హనుమంతుణ్ణి ఊర్మిళవద్దకు తీసుకు వెళ్ళాడు. ఆమె తన గదినుండి బయటికి రాలేదు. లక్ష్మణుడు అరణ్యానికి వెళ్ళే టప్పుడు తాను ఏ గదిలోనైతే ఉన్నదో, అతడు తిరిగి వచ్చేంతవరకు అదే గదిని వదలకుండా ఉన్నది. ఆమె ప్రతిజ్ఞ అంత దృఢమైనది. భరతుడు "వదినా! ఇదిగో, ఇతడు హనుమంతుడు", అని పరిచయం చేశాడు. "నాయనా! ఎక్కడినుండి వచ్చావు?" అని ఆమె అడిగింది. "అమ్మా! రామరావణయుద్ధంలో నీ భర్త మూర్ఛిల్లినాడు. 'లక్ష్మణా! నీవు లేని బ్రతుకు నాకెందుకు?' అని రాముడు పరితపిస్తున్నాడు. లక్ష్మణుణ్ణి బ్రతికించే నిమిత్తం నేను సంజీవనిమూలికను తీసుకువెళుతున్నాను", అన్నాడు. ఆ మాటలకు ఊర్మిళ పక్కున నవ్వింది. "హనుమాన్! నీకుకూడా ఇంతమాత్రం తెలియదా? లక్ష్మణుని ఉచ్ఛ్వాసనిశ్వాసములందుకూడా రామనామం నిండియున్నది. అలాంటి వానికి ఎట్టి ప్రమాదమూ జరగడానికి వీల్లేదు", అని పలికింది.

ప్రేమస్వరూపులారా! సుమిత్ర, ఊర్మిళలయొక్క భక్తిప్రపత్తులను గురించి రామాయణం ఎక్కడా వర్ణించలేదు. ధర్మమూర్తియైన మాతృమూర్తి సుమిత్ర. ప్రేమమూర్తియైన సతి ఊర్మిళ. ఈ ఇరువురూ జగత్తుకు ఎంతో గొప్ప ఆదర్శాన్ని అందించారు. మీరుకూడా 'సుమిత్ర'లు కావాలి, సుపుత్రులు కావాలి. అదియే ఈనాడు దేశం కోరుతున్నది.

srisathyasaivachanamrutam

భారతదేశంలో రామ చరిత్రను విననివారుండరు. కొన్ని వేల సంవత్సరములు గడచి పోయినప్పటికీ ఈనాటికీ రామాయణం నిత్యనూతనంగా ప్రకాశిస్తోంది. నిరంతరం రామ నామాన్ని స్మరించేవారికి, రామరూపాన్ని దర్శించేవారికి పునర్జన్మ ఉండదు. రామశక్తిని, రామనామ దివ్యప్రభావమును వాల్మీకి మహర్షి చాలా గొప్పగా వర్ణించాడు. ( శ్రీవారు తమ సహజశ్రావ్య గాత్రంతో ఈ క్రింది పాటను పాడి భక్తులచేత పాడించారు)

*రామా కోదండరామా రామా పట్టాభిరామా*
*రామా కళ్యాణరామా రాఘవా....*
*రామా నీకొక మాట రామా నాకొక మూట*
*రామా నీ పాటే పాట రామా నీ బాటే బాట*
*రామా నీకెవరు జోడు రామా క్రీగంట జూడు*
*రామా నేను నీవాడు రామా నాతో మాటాడు*
*రామనామమే మేలు రామచింతనే చాలు...*

*(తదుపరి, తమ దివ్యసందేశాన్ని కొనసాగిస్తూ ఇలా అన్నారు)*

ప్రేమస్వరూపులారా! రామనామమును మించిన అమృతం మరొకటి లేదు. కాని, ఈనాడు ప్రజలు నామచింతనను విస్మరించి సినిమాపేర్లను స్మరిస్తున్నారు. దానివల్లనే దేశానికీ గతి పట్టింది. గొప్ప విద్యావంతులు, సైంటిస్టులు, మేధావులు విభూతి పెట్టుకోవడానికికూడా సిగ్గు పడుతున్నారు. ఇంట్లో పెట్టుకుంటారుగాని, బయటికి వస్తూనే తుడిచేసుకుంటారు. ఈనాడు ఇదొక 'ఫ్యాషన్'గా తయారైంది. ఎవరేమనుకున్నా మనం భయపడనక్కర్లేదు. దైవ నామాన్ని ఉచ్చరించడానికి భయమెందుకు? వీధివీధిలోనూ, వాడవాడలోనూ దైవనామాన్ని చాటండి. రామనామంగాని, కృష్ణనామంగాని, శివనామంగాని... మీకు ఏ నామం ఇష్టమైతే ఆ నామాన్ని స్మరించండి. ఈనాడు భగవన్నామస్మరణ సన్నగిల్లడం చేతనే ఇంటింటియందు చిక్కులు బయలుదేరుతున్నాయి, అన్నదమ్ముల మధ్య కూడా కలహాలు ప్రారంభమౌతున్నాయి. హృదయంలో పవిత్రత

sri sathyasai vachanamrutam

లోపించడంచేత బయటినుండి అపవిత్రత ప్రవేశిస్తున్నది. అందరూ ధనంకోసం, పదవులకోసం ప్రాకులాడుతున్నారు. ఏమిటీ ధనం? ఏమిటీ పదవులు? ఇవి మనలను రక్షించగలవా? ఎంతమంది ధనవంతులు లేరీ ప్రపంచంలో! ఎంతమంది అధికారులు లేరీ ప్రపంచంలో! వారేమైనా సుఖశాంతులను పొందగల్గుతున్నారా? లేదు, లేదు. మానవునికి సుఖ శాంతులను, ఆనందాన్ని అందించేది భగవన్నామస్మరణ ఒక్కటే. భగవన్నామాన్ని అలక్ష్యం చేసేవారికి అధోగతి తప్పదు.

"ఓం నమశ్శివాయ" అనే పంచాక్షరీమంత్రానికి 'మ'కారము ప్రాణ సమానం. దానిని తొలగిస్తే అది 'నశ్శివాయ' అవుతుంది; అనగా, అమంగళకరమైపోతుంది. అట్లే, "ఓం నమో నారాయణాయ" అనే అష్టాక్షరీ మంత్రానికి 'ర'కారము ప్రాణసమానం. 'ర'కారము లేకపోతే అది కూడా అమంగళకరమైపోతుంది. పంచాక్షరీమంత్రానికి ప్రాణసమానమైన 'మ'కారము, అష్టాక్షరీమంత్రానికి ప్రాణసమానమైన 'ర'కారము – ఈ రెండింటి చేరికచేత ఏర్పడినదే రామనామము.

విద్యార్థులారా! ప్రజలారా! భక్తులారా! భగవన్నామస్మరణ తప్ప మిమ్మల్ని రక్షించేది మరొకటి లేదు. ధనము, పదవులు ఈనాడు వస్తాయి, రేపు పోతాయి. రాజకీయాలవల్ల ఎవరికైనా అధికారబలము రావచ్చును. అలాంటి అధికారం ఎంతకాల ముంటుంది? ఊపితే పోతుంది. కనుక, రాజకీయాలవల్ల లభించే అధికారంకోసం ప్రాకులాడవద్దు. ఎవరి హృదయంలో భగవన్నామం నిండియుంటుందో వారే నిజంగా ధన్యులు, పుణ్యులు. ఇష్టం లేనివారు వద్దని చెప్పవచ్చును. రాముడే లేడని మీతో వాదించవచ్చును. "రాముడు నీకు లేకపోవచ్చును. కాని, నాకున్నాడు. నా రాముడు లేడనటానికి నీవెవరు?" అని వారికి మీరు బుద్ధిచెప్పాలి. ఎలాంటి పరిస్థితిలోనూ భగవన్నామ స్మరణను మాత్రం వదలకండి. 'సర్వదా సర్వకాలేషు సర్వత్ర హరిచింతనం' చేయండి.

sri sathyasai vachanamrutam

రామ రామ రామ సీతా
రామ రామ రామ సీతా

1. శ్రీమద్రవికులమందు జనించి
సీతాదేవిని ప్రీతి వరించి
ప్రేమ నహల్యా శాపము దీర్చి
ప్రియభక్తుల రక్షించిన శ్రీరఘు ॥రామ॥

2. గురునాజ్ఞను వనమందొనరించి
గుహుని భక్తి కానందము చెంది
పరమాదరమున భరతుని గాంచి
పాదుక లొసగిన పావనచరితుడు ॥రామ॥

3. ఖరదూషణాది దనుజుల ద్రుంచి
కరుణ జటాయువు గతి సవరించి
శరభంగాది మునీంద్రుల బ్రోచి
శబరిఫలమ్ములు ప్రేమ భుజించిన ॥రామ॥

4. ముందుగ హనుమంతుని దీవించి
ముదమలరగ రవిసుతు పాలించి
చెంగిన కినుకతో వాలిని ద్రుంచి
చేరిన వానర వీరుల బ్రోచిన ॥రామ॥

5. రావణాది సురవైరుల ద్రుంచి
రమణితోడ సాధుల పాలించి
దేవతలెల్ల నుతింపగజేసి
దేవి గూడి పురి జేరిన శ్రీరఘు ॥రామ॥

sri sathyasai vachanamrutam

*6. నిజసహోదరులు నిను సేవింపగ*
*నిన్ను కూడి ప్రజలెల్ల సుఖింపగ*
*అజహరాది సురులెల్ల నుతింపగ*
*ఆనందముతో నయోధ్యనేలిన ॥రామ॥*

***(2002 ఏప్రియల్ 21వ తేదీ ఉదయం బృందావనంలో భగవాన్ బాబావారి దివ్యోపన్యాసం)***

sri sathyasai vachanamrutam